ప్రజాశక్తి
ఆదివారం 29 జనవరి 2023
5
శ్రీకాకుళం

వివిపి క్యూలైనులో కిక్కిరిసిన యాత్రికులు

ఆదిత్యుని దర్శనం.. ఆనంద పరవశం

- కన్నుల పండువగా రథసప్తమి వేడుకలు
- ఏర్పాట్లలో పాత సమస్యలే పునరావృతం
- సాధారణ సందర్శకులకు తప్పని ఇబ్బందులు
- ఉచిత దర్శనం, రూ.100 టిక్కెట్ల క్యూలైన్లలో తోపులాట
- సొమ్మసిల్లిన పలువురు వృద్ధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన క్షీరాభిషేక సేవ మంగళవారం ఉదయం సుమారు ఆరున్నర గంటల వరకు సాగింది. పట్టువస్త్రాల సమర్పణలో కొంత గందరగోళం చోటుచేసుకుంది. తొలుత దేవాదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ వస్త్రాలను సమర్పించిన తరువాత 1.30 గంటలకు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ సమర్పించారు. పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. రథసప్తమి వేడుకలను కనులారా వీక్షించేందుకు అర్ధరాత్రి నుంచే రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా నుంచి యాత్రికులు చేరుకున్నారు.

ఆదిత్యుని జయంతి వేడుకల్లో సాధారణ సందర్శకుల కష్టాలు పునరావృతమయ్యాయి. సామాన్య యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా దర్శనం కల్పిస్తామని అధికారులు చేసిన ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయి. వివిఐపి క్యూలైన్‌లో రద్దీని నియంత్రించడానికి విఐపిల పేరుతో రూ.500 పాసులు జారీ చేసినా ఫలితం కనిపించలేదు. డబ్బులు చెల్లించి పాసులు తీసుకున్నవారితో పాటు టికెట్ లేనివారిని సైతం ఆ క్యూలైన్‌లోకి పోలీసులు విడిచిపెట్టేశారు. భారీగా పాసులను జారీ చేయడంతో పోలీసులు రద్దీని నియంత్రించలేకపోయారు. దేవాలయం ఆర్చి, ఆలయం వద్ద ప్రధాన గేట్ వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. ఈ ఏడాది ఎప్పుడూ లేనివిధంగా సాయంత్రం 4 గంటల వరకు సందర్శకుల తాకిడి కొనసాగింది. సాఫీగా దర్శనం చేసుకుందామని రూ.500 పాసు తీసుకున్నవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిఐపి క్యూలైన్‌లో ఎప్పటిమాదిరిగానే పోలీసులు, పలు ప్రభుత్వశాఖలకు చెందిన సిబ్బంది తమ కుటుంబ సభ్యులను దగ్గర ఉండి దర్శనం చేయించడంలో తలమునకలయ్యారు

పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న కమిషనర్ హరి జవహర్‌లాల్

ఎస్‌పి మాటలు బేఖాతరు

పోలీసు సిబ్బంది ఎవరికి కేటాయించిన స్థానంలో వారే ఉంటూ రిలీవ్ సిబ్బంది వచ్చినంత వరకు ఎవరూ తమ స్థానాన్ని విడిచిపెట్టొద్దని ఆదేశించినా అవి అమలు కాలేదు. తమకు కేటాయించిన స్థానాలను వదిలి కుటుంబసభ్యులతో ఆలయంలోకి వచ్చారు. తమకు తెలిసిన వారు, పలుకుబడి ఉన్న వారిని వివిఐపి, విఐపి మార్గాల్లో పంపారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సాధారణ సందర్శకులకు సాఫీగా దర్శనం కల్పించడంలో దేవాదాయశాఖ విఫలమైందన్న విమర్శలు వినిపించాయి. జయంత్యుత్సవాల నిర్వహణకు ఆలయ ఈఒ హరి సూర్యప్రకాష్‌కు సహాయంగా శ్రీకూర్మం ఇఒ గురునాథరావు, మరో ఇఒ ప్రసాద్‌ను అధికారులు నియమించారు. ప్రోటోకాల్ వ్యవహారాలు అరసవల్లి ఇఒ చూసినా మిగిలిన ఇద్దరూ అనివెట్టి మండపంలోనే కనిపించారు. క్యూలైన్లలో సందర్శకులు ఏం ఇబ్బందులు పడుతున్నారో చూసే నాధుడే కరువయ్యాడు.

మంత్రికి ఆదిత్యుని చిత్రపటాన్ని అందిస్తున్న ఈఒ

సాధారణ సందర్శకులు తీవ్ర ఇక్కట్లు

క్యూలో చిన్నారిని బయటకు తీసిన పోలీసు

ఆదిత్యున్ని కనులారా చూసేందుకు వచ్చిన సాధారణ సందర్శకులకు అధికారులు చుక్కలు చూపించారు. ప్రత్యేకించి రూ.100 టికెట్, ఉచిత దర్శనం క్యూలైన్లలో ఉన్న యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్‌లు కిక్కిరిసిపోవడం, ఎండ వేడిమికి తాళలేక పలువురు వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. పోలీసు సిబ్బంది కొంత మంది వారికి నీళ్లు ఇచ్చి నీడ ఉన్న ప్రదేశంలోకి తీసుకువెళ్లారు. ఉచిత దర్శనం మార్గంలో ఒక కంపార్ట్‌మెంట్ నుంచి తర్వాత కంపార్ట్‌మెంట్‌లోకి సందర్శకులను విడిచిపెడుతున్న సందర్భంలో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. తోపులాటలో చిన్న పిల్లలు ఇరుక్కుపోవడంతో అక్కడ డ్యూటీలో ఉన్న రిజర్వుడ్ పోలీసులు పిల్లలను దాటించారు. కొంత మంది మహిళలు ఊపరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. తోపులాట, కిక్కిరిసిన క్యూలైన్‌లో ఉండలేక రూ.100 టికెట్ క్యూలైన్ నుంచి కొందరు మహిళలు బయటకు వచ్చి ఇళ్లకు వెళ్లిపోయారు. దర్శనం కోసం 8.30 గంటలకు క్యూలైన్‌లో ఉన్నవారు నాలుగు గంటలు గడిచినా కనీసం కేశఖండన శాల వరకు కూడా చేరలేకపోయారు.

ఆర్చి వద్ద యాత్రికులను నెట్టుతున్న పోలీసులు

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు

రథసప్తమి వేడుకలకు ఈ సారి వివిఐపిల తాకిడి సాధారణంగానే ఉంది. ఆదిత్యుని దర్శించుకున్న వారిలో పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, హైకోర్టు న్యాయమూర్తి టి.రాజశేఖరం, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయకుమార్, విశాఖ రేంజ్ డిఐజి ఎస్ హరికృష్ణతో పాటు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జిఆర్.రాధిక సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరితో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, శ్రీకాకుళం, విజయనగరం జెడ్‌పి చైర్మన్లు పిరియా విజయ, మజ్జి శ్రీనివాసరావు, బాలల హక్కు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం దంపతులు ఉన్నారు.,

మంత్రి అప్పలరాజు దంపతులు

కలెక్టర్ దంపతులు

ఆదిత్యుని చిత్రపటం అందిస్తూ..

ట్రాఫిక్ ఆంక్షలతో నగర ప్రజలకు నరకం

ఆదిత్యుని జయంత్యుత్సవ వేడుకలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు అమలు చేసిన మితిమీరిన ఆంక్షలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. వివిఐపిలకు రాచమార్గం కల్పించేందుకు శ్రీకాకుళం నగరంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను అమలు చేశారు. సూర్యమహల్ కూడలి వద్ద ఒక మార్గంలోనే రాకపోకలను అనుమతించారు. భాష్యం స్కూల్, అఫీషియల్ కాలనీ వద్ద మార్గాన్ని పూర్తిగా మూసేశారు. ఏడు రోడ్ల కూడలి వద్ద జిటి రోడ్డు మార్గంలోనూ వన్‌వేను అమలు చేశారు. పోలీసుల అతి ఆంక్షలతో జనం, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా మహిళా కళాశాల రోడ్డులో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. పాఠశాలలకు వెళ్తున ఆటోలను సైతం పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థులు పాట్లు పడ్డారు. పాఠశాలలకు భోజనాలను తీసుకువెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులను అడ్డుకోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న పోలీసు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను ప్రతిఘటించకపోతే దేశసంపదంతా అదాని, అంబానీలపరం అవుతుందని అన్నారు. ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీకి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్పొరేట్‌లకు అనుకూలంగా కార్మికవర్గం ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేశారని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కార్పొరేట్ విధానాలకు అనుకూలంగా ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకే బ్రిటీష్ కాలంనాటి చీకటి జిఒలను తీసుకొచ్చారని విమర్శించారు. మోడి కార్పొరేట్ అనుకూల విధానాల మూలంగా జీవనాధారం కోల్పోయి రైతులు, వ్యవసాయ కార్మికులు, చివరకు అసంఘటితరంగ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పతున్నారని చెప్పారు. దేశసంపద అంతా 10శాతంగా ఉన్న పెట్టుబడిదారులు, భూస్వాములకు కట్టబెడుతున్నారని అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులను హరించి కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని అన్నారు. జిఎస్‌టి భారాలు సామాన్యులపైనే ఎక్కువ పడుతోందని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని విమర్శించారు. కార్పొరేట్‌లకు రాయితీలు, సామాన్యులపై భారాలు అనే విధంగా బిజెపి పాలన ఉందని విమర్శించారు. యథేచ్ఛగా మానవ వనరులతోపాటు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారని విమర్శించారు. మోడి కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు సంఘటితం కావాలని, ఈ విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని, పోరాటాలతోనే కేంద్ర ప్రభుత్వానికి ముకుతాడు వేయాలని కోరారు. జిల్లాలో ఉద్దానం రక్షిత మంచినీటి పథకం కార్మికులకు 24 నెలలు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్యాంపిస్టన్స్, యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శ్యాంపిస్టన్స్ యాజమాన్యం 30 సంవత్సరాల సర్వీసు పూర్తయిందని అన్యాయంగా తొలగించిన కార్మికులను విధుల్లో కొనసాగించాలని అన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, ఎన్.వి.రమణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, ఎస్.లక్ష్మీనారాయణ, జి.అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - కంచిలి

రైతుల పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమది రైతు ప్రభుత్వమని, రైతులకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటామన్నారు. రైతుల సంక్షేమం కోసం సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుల కోసమే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. వాటి పనితీరును దేశమంతా ఆదర్శంగా భావిస్తుందన్నారు. తొందరలోనే రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా గిడ్డంగులను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. రైతుల ఇంటి వద్ద నుంచే ధాన్యం కొనుగోలు జరుపుతామన్నారు. ప్రస్తుతం లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు నిర్వహించామని, దానికి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. జిల్లా సివిల్ సప్లై మేనేజర్ జయంతి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో గతంతో పోలిస్తే వరి దిగుబడి అధికంగా ఉందన్నారు. అందువల్లే కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు విషయంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని, వాటిని సైతం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఈ క్రాప్ చేయించుకొని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు జరపడం లేదని, త్వరలోనే ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దేవదాసు రెడ్డి, ఎఒ ధనంజయరావు, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఆర్‌బికె అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ధాన్యం సేకరణ లక్ష్యం పెంచుతారా?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొంటామంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తున్నా చివరి వరకు ధాన్యం కొనేటట్టు లేరు. ప్రతి ఏడాదీ మార్చి 31 వరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 15తో ముగిస్తామని చెప్తోంది. జిల్లాలో పరిస్థితి చూస్తే సగం మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో నవంబర్ చివరి వారంలో కొనుగోళ్లు ప్రారంభించి ఇప్పటివరకు 3.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. జిల్లాలో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, అందులో రెండు లక్షల టన్నుల వరకు రైతుల అవసరాలకు పోను ఏడు లక్షల టన్నుల వరకు కొనుగోలు చేస్తామని తొలుత అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ సూచనలతో ఆ తర్వాత లక్ష్యాన్ని ఐదు లక్షల టన్నులకు కుదించారు. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని ఏడు లక్షలకు పెంచేలా చూడాలంటూ రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును రైస్ మిల్లర్లు కొందరు కలిసి విజ్ఞప్తి చేశారు. ఇది ఎంతవరకు అమలవుతుందోనన్న సందేహం కలుగుతోంది. ధాన్యం లక్ష్యం పెంచకపోతే మాత్రం రైతులు తీవ్ర ఇబ్బందులు చవి చూడాల్సి ఉంటుంది. జిల్లాలో పలు మండలాల్లో పొలాల్లోనే వరి కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మినుము, పెసర వంటి అపరాల సాగు తర్వాత నూర్పిడి చేస్తుండటంతో ఇప్పుడు కళ్లాల్లోకి ధాన్యం వస్తోంది. ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయిందనే పేరుతో కొనుగోళ్లు ఆపేస్తే వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని మిల్లులకు ఇచ్చిన ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి కావడంతో సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు రైతులు తమ ధాన్యాన్ని తీసుకువెళ్తూ తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. ధాన్యం సేకరణ లక్ష్యం పెంచుతారా లేక గడువు తేదీ వరకు కొనుగోలు చేసిన ధాన్యాన్నే లక్ష్యంగా చూపుతారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ధాన్యం కొనుగోళ్ల విషయంలో అమాత్యులిరువురూ పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. జిల్లా స్థాయిలో కనీసం ఒక్క సమీక్షా సమావేశమైనా నిర్వహించిన సందర్భాలు లేవనే చెప్పాలి. ధాన్యం కొనుగోళ్లలో రైతులు, మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం ఎవరూ చేయలేదు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జెసి రైతుల ఇబ్బందులను కొంతవరకు పరిష్కరించినా కొన్ని సమస్యలు వారి పరిధిలో లేవు.

ధాన్యం లక్ష్యం పెంపు విషయంలో మంత్రులు జోక్యం చేసుకుంటేగానీ పరిష్కారమయ్యే అంశం కాదు. తమ నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం లక్ష్యాన్ని చేరుకోవడంపై శ్రద్ధ చూపుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యం లక్ష్యాన్ని పెంచే అంశంపై దృష్టి సారించడం లేదు.

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల సమస్యలపై పోరాడాల్సిన టిడిపి లోకేష్ పాదయాత్ర జపం చేస్తోంది. పాదయాత్రను విజయవంతం చేయాలంటూ రకరకాల కార్యక్రమాలతో నాయకులు తీరిక లేకుండా ఉన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ట్రాక్టర్లతో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని చెప్పిన టిడిపి పాతయాత్ర అంశంతో అది మరుగున పడింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్రపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వైసిపి నాయకుల విమర్శలపై టిడిపి నాయకులు కౌంటర్లు ఇస్తున్నారు. వైసిపి, టిడిపి ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకోవడంలో తలమునకలవ్వడంతో ప్రజలు, రైతుల సమస్యలు పక్కకు మరలుతున్నాయి.

పెళ్లి కళ వచ్చిందండోయ్!

మార్చి 17 వరకు ముహూర్తాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

భజంత్రీలు మోగే సమయం ఆసన్నమైంది. మాఘ మాసం ప్రారంభం కావడంతో పెళ్లి సందడికి తెరలేచింది. ఈ నెల 26 నుంచి మార్చి 17 వరకు ముహూర్తాలున్నాయి. ఇప్పటికే 26, 27, 28 తేదీల్లో భారీగా వివాహాలు, గృహ ప్రవేశాలు జరిగాయి. అయితే మిగతా ముహూర్తాల్లో వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, నిశ్చయ తాంబూలాలు పుచ్చుకునేందుకు ఎవరికివారు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. వృత్తి, వ్యాపార, విద్య, ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన యువతీ యువకులు మూడు ముళ్ల బంధంతో ఒకటి కాబోతున్నారు. పెళ్లి కాగానే విదేశాలకు వెళ్లాల్సిన కొత్త దంపతులు ముందుగానే ఇందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. నెలన్నర పాటు ఎటు చూసినా పందిళ్లు.. సందళ్లు. కళ్యాణ మండపాలు మొదలు వాటిపై ఆధారపడి ఉన్న పలు రంగాలకు డిమాండ్ ఏర్పడింది.

అనుబంధ రంగాలకు ఉపాధి..

పెళ్లంటే ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి. పురోహితులు, వంటల తయారీదారులు, షామియానాలు సమకూర్చేవారు, ఫొటోగ్రాఫర్లు, లైటింగ్, పూల అలంకరణ చేసేవారు, మంగళ వాయిద్యాలు, దర్జీలు, ఆభరణ తయారీ దారులు, ఐస్ క్రీం, బ్యూటీ పార్లర్లు, కూరగాయల సరఫరాదారులకు ఇప్పటికే గిరాకీ పెరిగింది. ఉమ్మడి జిల్లాలోని రాజాం, పాలకొండతో పాటు జిల్లాలోని పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, పొందూరు, తదితర పట్టణాల్లో సుమారు 230 కళ్యాణ మండపాలు ఉన్నాయి. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు నిర్వాహకులు ఒక్కసారిగా అద్దె ధరలు పెంచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తేదీలు ఇవే..

గతేడాది డిసెంబరు 2 నుంచి 18వ తేదీ వరకు పరిమిత ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్లు తక్కువగానే జరిగాయి. ఈ నెల 26, 27, 28, ఫిబ్రవరి 1, 8,9, 10, 11, 12, 15, 23, 24, మార్చి 1, 5, 8, 9, 10, 11, 13, 15, 17 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.

త్వరగా సిఎంఆర్ రైస్ అన్‌లోడ్ చేయాలి

జెసి ఎం.నవీన్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, ఆమదాలవలస

జిల్లాలో రైతుల నుండి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో సిఎంఆర్ రైస్‌ను తొందరగా అన్‌లోడ్ చేయాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఎచ్చెర్ల మండలం అల్లినగరంలోని ఎఫ్‌సిఐ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సిఎంఆర్ రైస్ అన్‌లోడింగ్‌ను వేగవంతం చేయాలని, అందుకు సంబంధించి సాంకేతిక సిబ్బందిని మరింత పెంచాలని సూచించారు. అనంతరం ఆమదాలవలస ఎఎంసిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎఎంసికి 16 స్టేగ్‌ల వరకు అనుమతి మాత్రమే ఉన్నందున, ఇది నిండితే ఎఎంసి బఫర్ గోదాముకు తరలించాలని పౌర సరఫరాల సంస్థ సిబ్బందిని జెసి ఆదేశించారు. బఫర్ గోదాములో 46 స్టేగ్‌ల వరకు అవకాశం ఉంటుందని, దానివల్ల సిఎంఆర్ రైస్ ఎప్పటికప్పుడు డెలివరీ అవుతుందని వివరించారు. దీంతో రైతులకు సకాలంలో రశీదులను అందించేందుకు వీలుకలుగుతుందని, బ్యాంకు గ్యారంటీ కూడా పెరుగుతుందని జెసి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆకస్మిక పర్యటనలో జిల్లా సరఫరాల అధికారి డి.వెంకటరమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, ఎఫ్‌సిఐ, ఎఎంసి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జెసి నవీన్

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కొండవూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ వన్నె తగ్గని ఆట కబడ్డీ అని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడల్లో అభిరుచి పెంచడానికి ప్రభుత్వం క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటమితో నిమిత్తం లేకుండా ఆట తీరును ప్రదర్శించి ఆడాలని పిలుపునిచ్చారు. క్రీడలతో స్నేహ సంబంధాలు బలపర్చుకోవాలన్నారు. ఈ పోటీల్లో 50 చెట్లు పాల్గొంటున్నయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రీనివాసరావు ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, సర్పంచ్ కొల్లి భాస్కరరావు, మాజీ సర్పంచ్ కొల్లి రమేష్, మాజీ ఎంపిటిసి ఇప్పిలి అప్పన్న, లంగా ఆనంద్, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డికి వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలోని ఇఒపిఆర్‌డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని నెలలుగా వేతన బకాయిలు చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. కార్మికులకు గ్లౌజ్‌లు, మాస్కులు, యూనిఫారాలు ఉచితంగా అందజేయాలన్నారు. పాడైన రిక్షాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రామారావు, లక్ష్మి, అర్జున్, దండాసి, బాలాజీ, రమణ, రాములు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు నోడల్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి), జెనెక్స్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా గల కంపెనీలో 25 ఖాళీలను స్వల్పకాల శిక్షణ అనంతరం భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బిఎస్‌సి కెమిస్ట్రీ-2022 విద్యా సంవత్సరంలో పూర్తి చేసి 60 శాతం మార్కులు గల పురుష అభ్యర్థులు అర్హులని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో, ధ్రువపత్రాలతో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల లో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9703218888 నంబరును సంప్రదించాలని కోరారు.

ఉద్యోగుల సంక్షేమానికి తోడ్పాటు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులు తమ కర్తవ్య నిర్వహణలో ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటి నుంచి ఉపశమనం పొందడానికి రెవెన్యూ సర్వీసుల సంఘం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు సంతృప్తి నిస్తున్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. రెవెన్యూ అతిథి గృహం వద్ద రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ న్యూ ఎనర్జీ మెర్కబా, పిరమిడ్ మెడిటేషన్ సెంటర్, రెవెన్యూ కమ్యూనిటీ హాళ్లను జెసి ఎం.నవీన్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం ఆలోచించడంతో పాటు వారి బాగోగుల పట్ల శ్రద్ధ చూపడం శుభపరిణామమన్నారు. రానున్న రోజుల్లో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో తన వంతు తోడ్పాటు అందిస్తానన్నారు. జెసి మాట్లాడుతూ అసోసియేషన్ పటిష్ట పరచుకునేందుకు ప్రస్తుత ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్‌డిఒ బి.శాంతి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబోలు కృష్ణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.యన్.రాజు, జిల్లా ట్రెజరర్ జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు, తహశీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం

జెడి శ్రీధర్

ప్రజాశక్తి- కవిటి

చిరుధాన్యాలు పండించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని, అవసరమైతే అవే చిరుధాన్యాలను ప్రతినెలా రేషన్ ద్వారా ఉచితంగా పొందాలని జెడి కె.శ్రీధర్ రైతులకు సూచించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా మండలంలోని చిన్నకర్రివాని పాలెంలో స్థానిక రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చిరుధాన్యాలు పండించేందుకు పూర్తిస్థాయిలో రైతులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాకు అనుకూలమైన రాగులను పెద్దఎత్తున పండించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా రాగులకు రూ.3,500ల మద్దతు ధర ప్రకటించినట్లు వివరించారు. మెరక ప్రాంతాలు చిరు ధాన్యాలకు అనుకూలమని, ఎకరం వరి పండించే నీటితో నాలుగు ఎకరాల్లో రాగులు పండించవచ్చని రైతులకు సూచించారు. ఎకరా వరిపంటకు ప్రస్తుత పరిస్థితుల్లో రూ.25 వేలు ఖర్చు అవుతుంటే, చిరు ధాన్యాలకు కేవలం రూ.7,8 వేలు మాత్రమే ఖర్చు అవుతుందని అన్నారు. ఆరోగ్యానికి చిరుధాన్యాలకు మించిన ఔషధం లేదని అన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న జెడి శ్రీధర్

రాగులతో పాటు జొన్నలకు కూడా ప్రభుత్వం నాణ్యత బట్టి రూ.3,900 నుంచి రూ 5,500 మద్దతు ధర అందిస్తున్నట్టు తెలిపారు. ఎంఎస్‌సి మైక్రో బయాలజీ చదివిన మురళీకృష్ణ అనే రైతు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ఉపయోగించుకుని పది రకాల బిస్కెట్లు తయారు చేసి కోస్తాలో ఉన్న ఐదు జిల్లాల్లో అన్ని టీ షాపులకు బిస్కెట్లు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. దీనికోసం కెవికె ఆధ్వర్యాన నాబార్డు ద్వారా రైతులకు పూర్తి సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి చైర్మన్ దువ్వ కృష్ణారెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్‌సాహు, ఎడిఎ భవానీశంకర్, అసిస్టెంట్ ఎడిఎ కె.జగన్మోహన్, వ్యవసాయ అధికారి ఎస్.వి.ప్రసాదరావు, ఎఇ ఆర్.అప్పారావు, పిఎసిఎస్ సభ్యుడు ఎన్ని అశోక్ పాల్గొన్నారు.

సివిల్ సప్లై అధికారుల తీరుపై

సభ్యులు మండిపాటు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటి ఇంటికీ రేషన్ సరుకులు పంపిణీ సక్రమంగా జరగకపోవడంపై సివిల్ సప్లయి అధికారులపై సభ్యులు మండిపడ్డాడు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎంపిపి బోర పుష్ప శనివారం అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సివిల్ సప్లయి శాఖ పనితీరుపై జరిగిన చర్చలో సభ్యులు మాసుపత్రి చక్రవర్తి, గుజ్జు ఢిల్లీరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి ఇంటికీ రేషన్ సరుకులు పంపిణీ సక్రమంగా అందడం లేదని అన్నారు. ఈ విషయమై ఉన్నత అధికారులకు లేఖ రాస్తామని అన్నారు. సివిల్ సప్లయి డిటి టి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కార్డుదారుల జియో ట్యాగ్ పూర్తయితే పంపిణీ పుర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. ఈదుపురం గ్రామ పంచాయతీలో కొత్తగా నియమించిన వైద్యులు ఎక్కడ ఉంటున్నారని సర్పంచ్ నర్తు వరప్రసాద్, కె.మోహనరావులు ప్రశ్నించారు. వైద్యులు డాక్టర్ వెచ్చ సంతోష మాట్లాడుతూ ఈదుపురంలో నూతన భవన నిర్మిస్తున్నామని, దీనివల్ల తాత్కాలికంగా కమ్యూనిటీ ఆస్పత్రిలో ఉంటూ గ్రామాల్లో షెడ్యూలు ప్రకారం వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారానికి ఒక రోజు ఒక గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. కిడ్నీ రోగులు అధికంగా ఈ ప్రాంతంలో ఉన్నారని, డయాలిసిస్ కేంద్రం ఈదుపురంలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వరప్రసాద్ కోరారు. రైతులు పండించిన పంట ఫిబ్రవరి 15 వరకు ప్రతి గింజా కొనుగోలు చేస్తామని ఎఇఒ శ్రీదేవి తెలిపారు. ప్రతి క్వింటాకూ రవాణా ఛార్జీలు కచ్చితంగా వస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. బాహుదా ఛానల్ పనులు వేగవంతం చేయాలని మాసుపత్రి చక్రవర్తి కోరారు. హౌసింగ్ రుణాలు పొంది ఇళ్లు కట్టుకునేందుకు అనుమతి తీసుకొని ఇసుక తీస్తున్నా పోలీసులు, ఎస్ఇబి అధికారులు అడ్డుకుంటున్నారని సభ్యులు ఢిల్లీరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. గడపగడపకు కింద గుర్తించిన అభివృద్ధి పనులకు రూ.80 లక్షలు మంజూరయ్యాని ఎంపిడిఒ రామారావు తెలిపారు. పనులు వేగవంతంగా చేస్తామని, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వివిధ శాఖ అధికారులు, ఎంపిటిసి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పుష్ప

సమన్వయంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే కృష్ణదాస్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- జలుమూరు

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే మండలం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి వాన గోపి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ఉగాది రోజున నిర్వహించనున్న సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఎంపిపి మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్యకుమార్‌కు ఆదేశించారు. నీటి ఎద్దడి నివారణకు స్థానిక ప్రజాప్రతినిధుల సంప్రదించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ మాట్లాడుతూ రబీలో ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. పిఎం కిసాన్‌కు ఇకెవైసి తప్పనిసరి పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ ఎఇ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి జగనన్న ఇళ్ల కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి డోల నాగరత్నం, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షుడు పాగోటి రాజప్పలనాయుడు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు, ఎంపిడిఒ జి.వి.రవికుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడు మృతి

సునీల్ (ఫైల్)

సరుబుజ్జిలి : మండలంలోని కొత్తకోట వద్ద శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో రొట్టవలసకు చెందిన ధనుకోట సునీల్ (20) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై సునీల్ కొత్తకోట నుంచి రొట్టవలస వస్తున్నాడు. వెనుక నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి దాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గాయపడిన వ్యక్తి మృతి

కొత్తూరు : మండలంలోని నివగాంకు చెందిన ఎస్.సింహాచలం (56) గాయపడి రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని హెడ్‌కానిస్టేబుల్ బి.కృష్ణారావు తెలిపారు. ఈ నెల 22న సింహాచలం, ఆయన పెద్ద కుమారుడు ఢిల్లీశ్వరరావులు మద్యం తాగి మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారన్నారు. దీంతో కుమారు కోపోద్రిక్తుడై ఆటోకు వినియోగిస్తున్న రాడ్డుతో తలపై బలంగా కొట్టి గాయపరిచారని తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు సింహాచలాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారని, అక్కడ నుంచి పాలకొండ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి జెమ్స్‌కు రిఫర్ చేశారని పేర్కొన్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డారని చెప్పారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేకు సిఐ ఆర్.వేణుగోపాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

కాలిపోయిన సామగ్రి

కిరాణా షాపు దగ్ధం

జి.సిగడాం : మండలంలో దేవరవలసలో గుడ్ల శ్రీనివాసరావు కిరాణా షాపులో షార్ట్ సర్క్యూట్ వల్ల శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. సాయంత్రం 4.30 గంటల సమయంలో ఒక్కసారిగా షాపులో నుంచి మంటలు రావడంతో అప్రమతమయ్యారు. షాపులోని సామగ్రిని బయటకు తీసేందుకు ప్రయత్నంలో శ్రీనివాసరావు, ఆయన భార్య గీతలు గాయపడ్డారు. ఈ ప్రమాదంలోని పప్పులు, సోప్స్, బిస్కెట్లు తదితర సామగ్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.80 వేలు వరకు ఆస్తినష్టం ఉంటుందని ఆర్ఐ రామచంద్రరావు అంచనా వేశారు. సమాచారం అందుకున్న సర్పంచ్ టి.వెంకటరావు, విఆర్ఒ కనక మహాలక్ష్మి పరిశీలించారు.



అవార్డు అందుకున్న షాహుల్ హమీద్

షాహుల్ హమీద్‌కు అవార్డు

పలాస: అండమాన్ నికోబార్ దీవుల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, అండమాన్ 1వ వార్డు కౌన్సిలర్ షాహుల్ హమీద్ బెస్టు కౌన్సిలర్ అవార్డు లభించింది. అండమాన్ నికోబార్ లెఫ్ట్ లెంట్ గవర్నర్ డి.కె.జోష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జోష్ మాట్లాడుతూ వార్డులో ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని, అందుకు అవార్డు లభించిందని చెప్పారు. ఆయనకు అండమాన్ నికోబార్ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వి.మాధవనాయుడు, పార్టీ అధ్యక్షులు మాణిక్యరావు యాదవ్, సెక్రెటరీ బొడ్డు కాంతారావు, పలాస మండల తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, అండమాన్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

1 నుంచి దుర్గా భవాని జాతర

పోలాకి: పోలాకి కేంద్రంలో ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు దుర్గా భవాని అమ్మవారి 21వ జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు, పల్లి రాజు తెలిపారు. శనివారం ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. అయిదు రోజులు పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, దుర్గాభవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల యాత్రికులు పాల్గొవాలని కోరారు.

వందే భారత్ రైలు రూపకర్తతో సదస్సు

టెక్కలి రూరల్: ఇంజినీరింగ్ కెరియర్, ఇన్నోవేషన్ ఫర్ ఆత్మనిబ్బర్ భారత్ అనే అంశంపై ఐతమ్ కెరియర్ గైడెన్స్ సెల్, మెకానికల్ విభాగాలు సంయుక్తంగా శనివారం ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు' రూపకర్త, ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విశ్రాంత జనరల్ మేనేజర్ సుధాన్షమణి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల, ఇంటర్, పాఠశాల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచే తను ఏం కావాలో స్వప్నం కంటూ ఆ స్వప్నం సాఫల్యం అయ్యేందుకు తీవ్రంగా కృషి చేయాలన్నారు. ఏ రంగంలో అయినా అంకిత భావంతో విధులు నిర్వహించాలని, అటువంటి వారి సేవలను యాజమాన్యం గుర్తించాలని అన్నారు. ఇదే సమయంలో తప్పుచేసిన వారిపై కఠినంగా వ్యవహరించి తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వందేభారత్ రైలును సుదాన్స మణి భారత్‌కు అందించిన ఒక గొప్ప బహుమతని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కెరియర్ గైడెన్సెల్ కన్వీనర్ అసోసియేట్ డీన్ డాక్టర్ డి.యుగంధర్, మెకానికల్ హెచ్చుడి డాక్టర్ బి.శ్రీరాములు, బి.రామారావు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- కవిటి

ఎంపిడిఒను సన్మానిస్తున్న ఎంపిపి పద్మ

ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. ఉత్తమ ఎంపిడిఒగా కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు అందుకున్న పైలా సూర్యనారాయణరెడ్డిని స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విధి నిర్వహణలో నేటి ఉద్యోగులకు ఎంపిడిఒ సూర్యనారాయణ ఆదర్శమన్నారు. ఎటువంటి క్లిష్ట సమయంలో అయినా చాకచక్యంగా వ్యవహరించి తన సహ ఉద్యోగులకు మార్గదర్శనం చేశారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఆయన భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు, రివార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎఎంసి చైర్మన్ దువ్వ కృష్ణారెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్‌సాహు, వైసిపి లీగల్ సెల్ కార్యదర్శి పులకల శ్రీరాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : కాశీబుగ్గలోని 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని డిఇఇ మూర్తి, ఎఇ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత జాతీయ రహదారి, ఆర్.కె.పురం, జిఎంఇ, పద్మనాభపురం కాలనీ, పెంటిభద్ర, తాళభద్ర, అంబుసోలి, గేట్ దిగువ, పెసరపాడు, అంతరకుడ్డ, చినబాడం, నర్సిపురం, కోసంగిపురం ప్రాంతాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహాలక్ష్మితల్లి, గురప్పదొరల పెళ్లిరాట

పెళ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కమ్మసిగడాం మహాలక్ష్మితల్లి, గురప్పదొరల కళ్యాణం 30వ తేదీ రాత్రి 9.55 గంటలకు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పెళ్లిరాట మహోత్సవం ఆలయ పూజారి వెలిచేటి సింహాచలం ఆధ్వర్యాన కమిటీ సభ్యులు సమక్షంలో సర్పంచ్ నడుకుదిటి రజని శనివారం నిర్వహించారు. అనంతరం మూడురోజుల పాటు నిర్వహించనున్న జాతరకు మహాలక్ష్మితల్లి కళ్యాణ మండపంలో మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి సూర్యతేజ, వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్ కుమార్, మురళీధర్, రాయుడు, జి.జగన్నాథరావు, రఘునాథ్, మన్నె తాతీయులు, కృష్ణానందం, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, రామకృష్ణ పాల్గొన్నారు.

'యువగళం'లో పాల్గొన్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

లోకేష్‌తో నడుస్తున్న రవికుమార్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కొనసాగిస్తున్న రెండో రోజు శనివారం యువగళం పాదయాత్రలో జిల్లా టిడిపి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని ఆకాంక్షించారు. దారి పొడుగునా వృద్ధులు, యువత యాత్రకు బ్రహ్మరథం పడుతూ స్వాగతిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు, యువతకు జరుగుతున్న అన్యాయంపై నిలదీసేందుకే యువగళం పాదయాత్ర అని అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఒక్క డిఎస్‌సినైనా నిర్వహించారా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు పొట్ట చేత్తో పట్టుకుని వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాదయాత్రలో సరుబుజ్జిలి మండల తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు ఉన్నారు.

సకాలంలో రెన్యువల్ చేసుకోవాలి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్)లో వ్యవసాయ రుణం తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28లోగా 4 శాతం వడ్డీతో రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళీధర్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రుణం తీసుకున్న రైతులు 4 శాతం వడ్డీతో పాటు ఒర్జినల్ 1బి, బయోమెట్రిక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో తీసుకొని పిఎసిఎస్ కార్యాలయానికి రావాలన్నారు. సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని, లేకుంటే 13 శాతం అపరాధ వడ్డీ లోన్ మొత్తం చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు నిర్ణీత సమయంలో రుణాలని రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈయన వెంట సిఇఒ మెండ సత్యనారాయణ ఉన్నారు.

'ఆదిత్య'ను సందర్శించిన నటి

కోటబొమ్మాళి: స్థానిక ఆదిత్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలను టివి సీరియల్ నటి సీతామహాలక్ష్మి (శ్రావణి) శనివారం సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులతో, ఉపాధ్యాయులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తనది ఇదే మండలం చిన్నసాన పంచాయతీ పులిబంద గ్రామమని, తమ సోదరి ఈ పాఠశాలలో చదువుతుందని అన్నారు. ఆమె మా పాఠశాల చాలా బాగుంటుంది, నువ్వు ఒక్కసారి వచ్చి చూడు అక్క అని చాలా సార్లు పిలిస్తే వచ్చానని తెలిపారు. పాఠశాల చాలా బాగుందని, ఇక్కడ చదువుకోవడానికి పాఠశాల యాజమాన్యం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. తాను కార్తీకదీపం, గుప్పెడంతమనస్సు, ప్రస్తుతం ఈటివిలో రాత్రి 8 గంటలకు ప్రచారమవుతున్న గువ్వగోరింకతో పాటు పలు సీరియల్‌లో నటిస్తున్నాని చెప్పారు. ఆమెకు పాఠశాల కరస్పాండెట్ చింటు రాజారావు, ప్రిన్సిపాల్ శిమ్మ అప్పన్నలు ఘనంగా సన్మానించారు.

సీతామహాలక్ష్మిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

స్వచ్ఛంద సంస్థల ఔదార్యం

ప్రసాదాన్ని అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నివాసం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. అరసవల్లి కూడలిలోని కాకినాడ ఆదిత్య, మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సందర్శకులకు మంచినీళ్ల ప్యాకెట్లను అందించారు. కళాశాల డైరక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు, ఎన్ఎస్ఎస్ పిఒ మజ్జి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ అధికారులు సందర్శకులకు పలుచోట్ల శిబిరాలను ఏర్పాటు చేసి మంచినీళ్ల ప్యాకెట్లను అందించారు.

పులిహోర అందజేస్తున్న సూర శ్రీనివాసరావు

ఉచిత దర్శనం క్యూలైన్ వద్ద మాజీ సైనికుల సమాఖ్య శిబిరం ఏర్పాటు చేసి సందర్శకులకు టి, మజ్జిగ పంపిణీ చేశారు. ధర్మశాస్తా సన్నిధానం ట్రస్టు ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన...

రథసప్తమిని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకోవడానికి వచ్చిన యాత్రికులకు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్) నేతృత్వంలో లయన్స్ క్లబ్ సెంటర్ ఆదిత్యుని సందర్శనకు వచ్చే యాత్రికులకు చక్రపొంగలి అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా సాంస్కృతిక శాఖ, జిల్లా పర్యటన అధికారి నడిమింటి నారాయణరావు ప్రారంభించారు. సుమారు రెండు వేల మందికి చక్రపొంగిలిని అందజేశారు. కార్యక్రమంలో వావిలపల్లి జగన్నాథనాయుడు, ఆర్.శ్రీనివాసరావు, పొన్నాడ రవికుమార్, ఎన్.మోహన్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, బాడాన దేవభూషణ్, సునీల్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యాన...

రథసప్తమిని పురస్కరించుకుని అరసవల్లి స్వామి దర్శించుకోవడానికి వచ్చిన యాత్రికులకు ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత, పారిశ్రామిక వేత్త సూర శ్రీనివాసరావు ప్రసాదాలను పంపిణీ చేశారు. కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్న అనంతరం ఉచిత పులిహోరా ప్రసాదాల కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

గార పిహెచ్‌సి సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదిత్యుని సందర్శనకు వచ్చిన వారికి అవసరమైన వైద్య సాయం అందించారు. జెమ్స్ వైద్యులు, సిబ్బంది వైద్య సేవలను అందించారు. శివాని ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ఆశా దీపికా పౌండేషన్ ప్రథమ చికిత్స కేంద్రం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి వైద్య సాయం అందించాయి.

పులిహోర అందజేస్తున్న చక్రవర్తి

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- జలుమూరు

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవలో భాగంగా జలుమూరు, సారవకోట మండలాలకు కేటాయించిన సంచార పశు వైద్యశాలను జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు చికిత్స కోసం దూర ప్రాంతాల్లోని పశు వైద్యశాలలకు తీసుకువెళ్లాలంటే వ్యయప్రయాసలతో కూడిన పని అని పేర్కొన్నారు. అందుకే ఇంటి వద్దకే వచ్చి పశువులకు చికిత్స అందించేలా ప్రభుత్వం సంచార పశువైద్యశాలలను ఏర్పాటు చేసిందన్నారు. 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే వెంటనే పశు వైద్య సహాయకులు ఆ ప్రాంతానికి చేరుకుని పశువులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి మండల కన్వీనర్ కనుసు సీతారాం, వైసిపి నాయకులు మొజ్జాడ శ్యామలరావు, పైడి విఠల్‌రావు, ధర్మాన జగన్మోహనరావు, పశు సంవర్ధకశాఖ ఎడి ఎం.లోకనాథం, అచ్యుతాపురం పశువైద్యాధికారి పట్ట సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కవిటి: పశు సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగలో సంచార పశు అంబులెన్స్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, ఎలమంచి నీలయ్య పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయాలి

ప్రజాశక్తి- పలాస

మాట్లాడుతున్న తవిటయ్య

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని, అందుకు ప్రతి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని కాశీబుగ్గ సబ్ రిజిస్టర్ ఎస్.తవిటయ్య సచివాలయం కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల సచివాలయం కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండియన్ స్టాంప్ చట్టం-1899, రిజిస్ట్రేషన్ 1908 చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. సెక్షన్ 22ఎ చట్టం ప్రకారం నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదన్నారు. సెక్షన్ 32ఎ ప్రకారం అమ్మకం, కొనుగోలు, సాక్షుల వివరాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. క్రిమినల్, ఇంజెక్షన్ ఉన్నప్పుడు రిజిస్ట్రేషన్ చేయకూడదన్నారు. సెక్షన్ 88 ప్రకారం ప్రభుత్వానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ఉంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉన్నత అధికారుల ప్రతినిధులు వస్తారని చెప్పారు. సమావేశంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిమ్మాడ విద్యార్థుల ఎంపిక

కోటబొమ్మాళి: ఈ నెల 30 నుంచి ఫిబ్రరి 1 వరకు కర్నూలులో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో రగ్బీ క్రీడకు మండలంలోని నిమ్మాడ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చింతు నవనీఖతి, కర్రి దిలీపులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాగోటి రామకృష్ణ శనివారం తెలిపారు. రగ్బీ క్రీడకు తమ విద్యార్థులు ఎంపికపై వ్యాయామ ఉపాధ్యాయులు కె.అనితశ్రీ, ఉపాధ్యాయులు గండేపల్లి శ్రీనివాస్, సిబ్బంది అభినందలను తెలియజేశారు.

శిక్షణకు అన్నా శ్యామూల్ ఎంపిక

అన్నాశ్యామూల్

జి.సిగడాం : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా అభియాన్ సంస్థ తరుపున రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ యాజమాన్యాల పరిధిలో పాఠశాలల ప్రిన్సిపాళ్లకు, ప్రధానోపాధ్యాయులకు, ప్రత్యేక అధికారులకు నాయకత్వ అంశాలపై శిక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఎంపికైన వీరికి ఐఐఎం అహ్మదాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. లీడర్షిప్ శిక్షణకు ఎపి మోడల్ పాం శాల ప్రిన్సిపాల్ డాక్టర్ లెంక అన్నాశామ్యూల్ ఎంపికయ్యారు. శిక్షణ తరగతులకు పరీక్ష ద్వారా ఎంపిక చేశారు. అన్నశ్యామూల్ ఎంపికపై పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ లీడర్షిప్ శిక్షణకు వెళ్లడం గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్రానికి ఎపి మోడల్ పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకొస్తానని తెలిపారు.

సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 12,14 వార్డుల్లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, ఇన్‌ఛార్జి ఎఇ పృద్వీ, తారకేష్, పదో వార్డు కౌన్సిలర్లు తేజేశ్వరరావు, పిలక సంతోష్, బుడుపు త్రినాథ్, నీలాపు ఢిల్లీ పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గడపగపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బైపల్లిలో సర్పంచ్ ప్రతినిధి డొంక విద్యాసాగర్ అధ్యక్షతన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉంటే సంక్షేమం ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేరుతుందన్నారు. పాదయాత్ర పేరుతో రాష్ట్రంలో తిరగడానికి సిద్ధమైన లోకేష్ తన తండ్రి చంద్రబాబు పాలన తీసుకొస్తానని ప్రజలకు హామీ ఇవ్వగలరా? అని సవాల్ విసిరారు. వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ మధ్య 19

సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి అప్పలరాజు

కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం మాట వాస్తవవేనని అంగీకరిస్తూ ఈ రోడ్డు పూర్తి చేసి పాదయాత్ర చేపడతానని సభాముఖంగా ప్రకటించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును స్వయంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసిపి అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపిపి వంక రాజు, ఎంపిటిసి మద్దు పరమేశ్వరి, సర్పంచ్‌లు డొంక ఉష, మామిడి భాస్కరరావు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని మాకన్నపురం పంచాయతీలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరెడ్డి, ఎంపిపిలు ఎన్.దాసు, పైల దేవదాస్‌రెడ్డి, మద్దు రాజారావు, రౌతు విశ్వనాథం, వినోద్‌కుమార్ పండా, మోహనరావు, హరీష్ పాల్గొన్నారు.

తీరంలో రథసప్తమి సందడి

సోంపేట : బారువ తీరానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి- కవిటి

రథసప్తమి వేడుకల సందర్భంగా సంద్రం సందడిగా మారింది. మండలంలోని పుక్కల్లపాలెం, కపాసుకుద్ది, కర్రివానిపాలెం, బట్టివానిపాలెం తదితర గ్రామాల తీరంలో వేకువ జామునుంచే భక్తుల కోలాహలం మొదలైంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా యాత్రికులు సముద్ర స్నానాలు చేసి సూర్యనారాయనుడికి పూజలు చేశారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు, ఎం.సున్నపల్లి, మేఘవరం, జగన్నాథపురం, ఉమిలాడ సముద్ర తీరాల్లో రథసప్తమి సందర్భంగా యాత్రికులు తాకిడి పెరిగింది. వేకువజామున నాలుగు గంటల నుంచి సముద్ర తీరాలలో వాతావరణం నెలకొంది. సముద్రతీరాలలో ఇసుకతో లింగాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. తీరంలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సూర్యోదయాన్ని తిలకించి పూజలు చేశారు.

సోంపేట : రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని బారువ సముద్ర తీరం వేకు జామున భక్తుల తాకిడితో కిటకిటలాడింది. సముద్ర స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇచ్ఛాపురం : రథసప్తమి సందర్భంగా బహుదా నది, డొంకురు సముద్ర తీరంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని సూర్య భగవానుని పూజలు నిర్వహించారు. వేకవజామున నుంచే కిటకిటలాడియి.

వజ్రపుకొత్తూరు : మండలంలో అక్కుపల్లి శివసాగర్ బీచ్, కంబాలరాయుడుపేట, నువ్వులరేవు సముద్రతీరంలో యాత్రికులు అధిక సంఖ్యలో సముద్ర స్నానం ఆచరించి సూర్యనారాయణ పూజ నిర్వహించారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

టెక్కలి రూరల్ : టెక్కలి వెంకటేశ్వర కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయానికి యాత్రికులు వేకువజామునే చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. టెక్కలి పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో దర్శనానికి వచ్చారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వన్‌ను ఎస్ఐ ఎల్.రామకృష్ణ ఏర్పాటు చేశారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని చిల్లపేటరాజాం పంచాయతీలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నూతన గ్రామ సచివాలయం భవనాన్ని నిర్మించారు. ఈ నూతన భవనాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి సచివాలయానికి రూ.కోటి నిధులతో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు నిర్మించామన్నారు. 50 ఇళ్లకు వాలంటీర్‌ను నియమించి ప్రజల బాగోగులకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

రణస్థలం: మండలంలోని తెప్పలవలస పంచాయతీ సీతారాంపురంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలు ఎప్పటికి మరువరానివని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం : మండలంలోని బాతువలో వైసిపి నాయకులు ముల్లు నారాయణప్పడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఈయన వెంట ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, బూత్ కమిటీ కన్వీనర్ ఆబోతులు జగన్నాథం, బాతువ ఎంపిటిసి ప్రతినిధి బూటు అప్పారావు ఉన్నారు.

వృద్ధులకు ఆహారం అందజేత

శ్రీకాకుళం అర్బన్ : పొందూరుకు చెందిన బొడ్డేపల్లి దామోదరరావు, ఇందుమతి దంపతుల కుమారుడు ప్రణయ్ పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని ప్రశాంతి వృద్ధజనాశ్రమంలో శనివారం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ మేరకు మధ్యాహ్నం భోజనంతో పాటు వంద కేజీల బియ్యం, ఇతర ఖర్చుల నిమిత్తం కొంత మొత్తాన్ని ప్రణయ్ చేతుల మీదుగా అందజేశారు.

డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం

వ్యాధులపై అప్రమత్తం

బూర్జ : పశువులకు సంభవించే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సరుబుజ్జిలి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు సిహెచ్.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కొల్లివలసలో సర్పంచ్ జీడి వేణు అధ్యక్షతన శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా డీ వార్మింగ్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లివలస పశు వైద్య శాఖ అధికారి జి.వెంకటరావు, సిహెచ్.సింహాచలం, వెంకటరమణ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

పలాస : సిపిఐఎంఎల్ లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా లీడింగ్ కమిటీ ఆధ్వర్యాన పల్లెపల్లెకు, గ్రామ గ్రామాన కార్యక్రమంలో భాగంగా శనివారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. అనంతరం పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా లీడింగ్ కమిటీ సభ్యులు రామారావు, మద్దిల దుష్యంతు, జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, ఈశ్వరి, అప్పయ్య, పాపయ్య, జగదీష్, ముసలయ్య, నారాయణ, రామకృష్ణ, యుగంధర్, అప్పారావు, శ్రీను, నాగేశ్వరరావు , కైలాస్, రామారావుపాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి- పలాస

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గరుడఖండి సర్పంచ్ బొత్స రాజేశ్వరి కోరారు. మండలంలోని గరుడఖండిలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు రోగులకు వైద్యాధికారులు ప్రవాంత్‌కుమార్, నమృత 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 23 మందికి మెరుగైన చికిత్స కోసం జెమ్స్ తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బొత్స షణ్ముఖరావు, నెమలిపురి తులసీరావు, జెమ్స్ మార్కెటింగ్ టీం ఐ.ప్రదీప్, ఆర్. రుపతిరావు, ఎం.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తేజేశ్వరరావు పర్యటన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పలు గ్రామాల్లో విద్యా వేత్త సిరిపురం తేజేశ్వరరావు శనివారం పర్యటించారు. పరశురాంపురం పంచాయతీలోని నందవ, రాయికోల, తోవూరు, పరశురాంపురం, తూముకొండ రామచంద్రపురం గ్రామాల్లో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కేలండర్లను అందజేశారు. కార్యక్రమంలో సరాళి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, దారపు గోవిందరావు, ఆనంద్, వెంకన్న, లింగాల వెంకటకృష్ణ, పైల భాస్కరరావు పాల్గొన్నారు.

కేలండర్లను అందజేస్తున్న తేజేశ్వరరావు

మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

పారిశుధ్యం మెరుగుపై కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని పలాస మున్సిపల్ చైర్మన్ వల్ల గిరిబాబు అధికారులకు ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, మున్సిపల్ పారిశుధ్య అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు ఎంతమంది ఉన్నారు, రోజూ ఎంతమంది విధుల్లో ఉంటున్నారు, ఎప్పటికప్పుడు ఎంతమంది సెలవు పెడుతున్నారు, ఏయే ప్రాంతాల్లో కార్మికులు లేరు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం నిర్వాణపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులు మున్సిపాలిటీకి అవసరమైతే రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టిలో పెట్టి కొత్తవారిని నియమిస్తామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న నాగరాజు

అటవీ హక్కుల చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అటవీ హక్కుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. మండలంలోని ఆంపురం, పింగువాడ, దారిపేట గ్రామాలకు చెందిన గిరిజనులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గిరిజన కుటుంబానికీ కొండల ప్రాంతంలో పది ఎకరాల అటవీ భూమి పొందేందుకు హక్కు ఉందని తెలిపారు. 2006 అటవీ చట్టం హక్కు గురించి తెలుసుకుంటే మంచిదని పేర్కొన్నారు. పోడు వ్యవసాయం ద్వారా గిరిజనులు ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆంపురం సర్పంచ్ జమ్మయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

'రెడ్డి శాంతికే టిక్కెట్'

కొత్తూరు : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గానికి ప్రస్తుత ఎమ్మెల్యే రెడ్డి శాంతికే టిక్కెట్ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇస్తారని వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, ఎఎంసి ప్రతినిధి గోగుల వరప్రసాదరావునాయుడు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్ వీధిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నేరుగా సిఎంను కలవలేని వారు ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో సర్పంచ్ ప్రతినిధులు పడల లక్ష్మణరావు, మొజ్జాడ చక్రపాణి, ఎంపిటిసి వసుమ లక్ష్మీనారాయణ, లోతుగెడ్డ తిరుపతిరావు, జి.ఆనందరావు, చోడవరపు జోగినాయుడు, బి.శ్రీను, పంకాజ్ దాస్, జడ్డు రామకృష్ణ పాల్గొన్నారు.

కేకును కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా తిలక్ జన్మదినం

కోటబొమ్మాళి: కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ జన్మదిన వేడుకలు శనివారం కోటబొమ్మాళిలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, వైసిపి నాయకులు అన్నెపు రామారావు పేరాడ వెంకటరావు, పొన్నాన మోహనరావు, నేతింటి సింహాచలం పాల్గొన్నారు.